క్లుప్తంగా

ఖమ్మం ఎంపీ నామాను కలిసిన ఎమ్మెల్యే హరిప్రియ



నామా నాగేశ్వరరావుతో హరిప్రియ తదితరులు

ఇల్లెందు: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత నామా నాగేశ్వరరావును శుక్రవారం ఖమ్మంలోని ఆయన స్వగృహంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 14న టేకులపల్లి మండల కేంద్రంలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నేతలు హరిసింగ్‌నాయక్, ఎస్.రంగనాథ్, జేకే శ్రీనివాస్, పరుచూరి వెంకటేశ్వరరావు, రామా ఉన్నారు.

ఇంటర్ టాపర్లకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ర్యాంకులు సాధించిన కేటీపీఎస్ ఉద్యోగుల పిల్లలను కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు సన్మానించారు. శుక్రవారం సీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టిజన్ కడారి లింగయ్య కుమారుడు వరుణ్, పగడాల రమేశ్ కుమారుడు సాయి మనోజ్‌లకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఈ వి.వెంకటేశ్వర్లు, ఏడీఈ సౌజన్య, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ పాల్గొన్నారు.

అగ్రి క్లినిక్ వలంటీర్ల నియామకం

ఇల్లెందురూరల్: సుదిమళ్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ పారాలీగల్ వలంటీర్లను జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ శుక్రవారం నియమించింది. ఇల్లెందుకు చెందిన సతీష్ ఖండేల్‌వాల్, గుండెబోయిన రామకృష్ణలకు ఈ అవకాశం కల్పించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, నల్సార్ యూనివర్సిటీ సంయుక్తంగా పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి తాము హాజరైనట్లు సతీష్‌ఖండేల్‌వాల్, గుండెబోయిన రామకృష్ణ ఫోన్‌లో తెలిపారు. భూమిలో విత్తనాలు నాటినప్పటి నుంచి కోతకు వచ్చి మార్కెటింగ్ చేసే వరకు రైతులకు అవసరమైన న్యాయసలహాలపై శిక్షణ శిబిరంలో సూచించినట్లు చెప్పారు.

క్రీడల్లోనూ రాణించాలి



సాయిపూజితను అభినందిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంటౌన్: ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. తైక్వాండో జాతీయ క్రీడాకారిణి ఇనగాల సాయిపూజిత తన తండ్రి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయిపూజితను అభినందించి మాట్లాడారు. టూటౌన్ సీఐ ఎల్.రాజు, పి.కాశీహుస్సేన్, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

ఏదైనా జరిగితే..



బైక్‌పై వెళ్తున్న ఆకతాయిలు

ఇల్లెందు: ఓ ఐదుగురు ఆకతాయిలు అతివేగంతో బైక్‌పై చక్కర్లు కొడుతూ శుక్రవారం వీరంగం సృష్టించారు. వీరంతా 20 ఏళ్ల లోపు వారే. ఇల్లెందు– బయ్యారం మండలాల సరిహద్దులోని రోడ్డుపై మోటారు సైకిల్‌పై కూర్చొని అతివేగంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించారు. ప్రమాదం అని తెలిసినా నిర్లక్ష్యంగా సవారీ చేస్తుండగా మందలించిన వారిపై సైతం దూషించడం గమనార్హం.

పేరుకే పల్లె దవాఖానాలు

- డాక్టర్లు లేక ఏఎన్ఎంలే వైద్యసేవలు అందిస్తున్న వైనం
- గ్రామీణులకు అందని మెరుగైన వైద్యం



కొమ్ముగూడెం పల్లె దవాఖానా



అన్నారుపాడు పల్లె దవాఖానా



డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

జూలూరుపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలకు శ్రీకారం చుట్టింది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం 2021లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సబ్ సెంటర్ల పరిధిలో ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే ప్రజలు వైద్యం పొందడానికి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాలకు వెళ్లే పరిస్థితి లేకుండా హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. జిల్లా వ్యాప్తంగా 240 హెల్త్ సబ్ సెంటర్లు ఉండగా 132 హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) పరిధిలో 9 హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో కొమ్ముగూడెం, భేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. అయితే కొమ్ముగూడెం పల్లె దవాఖానాకు మాత్రమే ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించగా 11 నెలల క్రితమే ఆ డాక్టర్ డిప్యూటేషన్‌పై రామవరం(అర్బన్) ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లారు. భేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చిన నాటి నుంచి డాక్టర్లను నియమించలేదు. అయితే గత జనవరిలో భేతాళపాడు, అన్నారుపాడు పల్లె దవాఖానాలకు డాక్టర్లను నియమించగా, పల్లె దవాఖానాల్లో పని చేసేందుకు ఇష్టం లేక డాక్టర్లు రాజీనామా చేసి వెళ్లిపోయారు. పల్లె దవాఖానాల్లో ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించాల్సినప్పటికీ ఇప్పటి వరకు ఆ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఖాళీగానే ఉన్నాయి. దీంతో మొదటి దశలో కొమ్ముగూడెం, భేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లు పల్లె దవాఖానాలుగా మారినప్పటికీ డాక్టర్లు లేకపోవడంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా పేరు మార్చారే తప్ప వైద్యసేవల్లో మార్పు లేదు. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మారాయనే విషయం స్థానిక ప్రజలకు తెలియకపోవడం విశేషం. డాక్టర్లు లేకుండా హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చినా ప్రయోజనం ఏమిటనీ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పల్లె దవాఖానాల్లో డాక్టర్ల నియామకాల ప్రక్రియ కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ.40 వేలు వేతనంతో ప్రభుత్వం చేపడుతున్నా.. పల్లె దవాఖానాల్లో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్‌ను నియమించాలి



పల్లె దవాఖానలో డాక్టర్‌ను నియమించి, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకరావాలి. పల్లె దవాఖాన ఏర్పడిన రెండు, మూడు నెలలు మాత్రమే డాక్టర్ ఉన్నాడు. ఆ తరువాత డాక్టర్ రావడం లేదని వైద్యసిబ్బందిని అడిగితే వేరే ఆస్పత్రికి వెళ్లారని చెప్పారు. ఏడాదిగా పల్లె దవాఖానాల్లో డాక్టర్ లేడు.

– భూక్యా వీర్యా, కొమ్ముగూడెం

మెరుగైన వైద్యం అందించాలి



గ్రామంలో పల్లె దవాఖాన ఏర్పాటు చేయడం చాలా మంచిది. అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు, డాక్టర్‌ను నియమించి మెరుగైన వైద్యం అందించాలి. ఏ చిన్న రోగానికైనా కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికై నా ప్రభుత్వం పల్లె దవాఖానలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టు భర్తీ చేయాలి.

– గుగులోత్ మాంగిణీ, అన్నారుపాడు

డాక్టర్లను రిక్రూట్ చేయాల్సి ఉంది



అన్నారుపాడు, భేతాళపాడు పల్లె దవాఖానాలకు కేటాయించిన ఇద్దరు డాక్టర్లు రాజీనామా చేశారు. మళ్లీ రిక్రూట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం పల్లె దవాఖానాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ రాకేష్ కుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు

మండలంలో జెడ్పీ సీఈఓ పర్యటన



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న విద్యాలత

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలం రుద్రంపూర్, గౌతంపూర్ గ్రామపంచాయతీలలో శుక్రవారం చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారిణి మెరుగు విద్యాలత పర్యటించారు. గ్రామపంచాయతీల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణానికి, గోవర్ధనగిరి బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలించారు. డంప్ షెడ్‌లో సెగ్రిగేషన్ విధానాన్ని పరిశీలించి పలు సూచనలను చేశారు. అనంతరం రుద్రంపూర్‌లోని నర్సరీని పరిశీలించారు. విత్తనాలు మొలకెత్తని బ్యాగులలో కొత్త విత్తనాలను విత్తాలని సూచించారు. మండలంలోని కార్యదర్శులు గ్రామపంచాయితీల్లో రెండు రెట్రో ఫీట్‌లు, ఇంకుడు గుంతలు, మిగిలిపోయిన మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాల్లో బుష్ క్లియరెన్స్ చేయాలని, తడిపొడి చెత్తలను ప్రతిరోజూ వేరు చేయాలని, శ్మశాన వాటికలో నీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీ నిర్వాసితులకు పరిహారమివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఓసీ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కోయగూడెం ఓసీ–2, ఫిట్ వన్, భూనిర్వాసితులకు వారం రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని 2018 డిసెంబర్‌లో హైకోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటి వరకు నష్టపరిహారం రాలేదన్నారు. ఆదివాసీ గిరిజనులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ధర్నా అనంతరం వ్యక్తిగత దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు ఇవ్వగా.. రీసర్వే చేయిస్తామన్నారు. దీనివల్ల కాలయాపన అవుతుంది తప్ప, సమస్య పరిష్కారం కావడం లేదని విమర్శించారు. తహసీల్దార్, ఆర్డీఓ గతంలో విచారణ చేసి ఎఫ్ఆర్‌సీ పట్టా భూములు కోల్పోయిన వారికి పట్టా లేకున్నా అనుభవంలో ఉన్న సాగుదారులను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. హైకోర్టు తీర్పును కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. అదనపు కలెక్టర్ భూనిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈసం నరసింహారావు, జోగ దశరథ, చింత రమేష్, జబ్బ కన్నయ్య, వరప్రసాద్, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

18న బీసీ మహా సమ్మేళనం



మాట్లాతున్న నాగేశ్వరరావు గౌడ్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 18న హైదరాబాద్‌లోని నాగోల్‌లో శుభం కన్వెన్షన్‌లో నిర్వహించనున్న బీసీల గోస.. బీజేపీ భరోసా బీసీ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాయలంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నలుమూల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐదుగురు కేంద్రమంత్రులు వస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో కేసీఆర్‌తో ఓబీసీలకు ఒరిగిందేమి లేదని, కులవృత్తులు ఆగమయ్యాయన్నారు. బీసీ విద్యార్థులకు చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోగా, బీసీ విద్యార్థులను అణచివేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ యువకులకు సబ్సిడీపై రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, రవీందర్, టీ.నరేంద్రబాబు, జి.రవిగౌడ్, జటంగి కృష్ణ, చెన్నకేశవ, దుర్గారావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, రాంబాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం



సబితను సన్మానిస్తున్న టీవీపీఎస్ బృందం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా దివ్యాంగ సంక్షేమ అధికారిగా నూతనంగా నియమితులైన సబితను తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ప్రతినిధి బృందం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 25 వేల మంది దివ్యాంగులు విద్య, వైద్యం, ఉపాధి లేక సమస్యలతో సతమతమవుతున్నారని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సబిత మాట్లాడుతూ... సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాటి నాగేశ్వరరావు, జూలూరుపాడు మండల అధ్యక్షుడు సున్నం కరుణాకర్ పాల్గొన్నారు.

‘గడల’ పర్యటన

కొత్తగూడెంరూరల్: నియోజకవర్గంలో శని, ఆదివారం రెండు రోజులు పాటు డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డీహెచ్ గడల శ్రీనివాసరావు పర్యటిస్తారని ఆ ట్రస్ట్ సభ్యుడు జోగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలలో జరగనున్న కార్యక్రమాలకు హాజరవుతారని పేర్కొన్నారు. అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: టేకులపల్లి ఎ కాలనీతండా నుంచి దుబ్బతండా మార్గంలో పంట పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరితంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పశువులు మేతకు వెళ్తుంటాయి. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లివస్తుంటారు. దీనిపై ఈనెల 4న సాక్షిలో అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో ‘ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా’కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. ఏఈ హెచ్.దేవా ఆదేశాల మేరకు లైన్‌మెన్ కూరపాటి లక్ష్మీనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి విద్యుత్ తీగలను సరి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టేకులపల్లి: బొమ్మనపల్లి సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బొమ్మనపల్లి ఏఈ పీజీ కన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మనపల్లి, కోయగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్, చెట్లు నరికివేత కారణంగా ఉదయం 7 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దీక్షలో సొమ్మసిల్లిన వీఓఏ

జూలూరుపాడు: వీఓఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 26వ రోజు కొనసాగింది. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరగడంతోపాటు, వడ గాలులు వీస్తుండటంతో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు కడియాల ఉమ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. తోటివారు ముఖం పై నీళ్లు చల్లడంతో స్పృహలోకి వచ్చింది. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ.. నాలుగు వారాలుగా సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మోదుగు బాల కోటేశ్వరి, రుక్మిణి, బాపట్ల సత్యావతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15రోజులుగా కార్యదర్శులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. నాలుగు సంవత్సరాల శిక్షణ కాలం పూర్తయినా నేటికీ రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను పరిష్కరించి విధుల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం..



గొత్తికోయలతో మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంరూరల్: ఆదివాసీ కుటుంబాలకు అండగా ఉంటామని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం క్రాంతినగర్‌లో గొత్తికోయ గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో ఉండే 33 వలస ఆదివాసీ కుటుంబాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు అండగా ఉంటామని, వారికి ఏ అవసరం వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. స్థానికులు పలు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకరాగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే, తమకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడ్డ వ్యక్తులకు సహాయ సహకారాలు అందించకూడదని సూచించారు. కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ రమాకాంత్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై ప్రవీణ్, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ పాటించండి



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ రవిబాబు

ఇల్లెందు: ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉంది.. క్లీన్ అండ్ గ్రీన్ పాటించండి అంటూ ప్రభుత్వ ఆస్పత్రి అపరిశుభ్రతపై డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు సీరియస్ అయ్యారు. శుక్రవారం ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. మాట్లాడుతూ.. రోజుకు మూడుసార్లు ఆస్పత్రిని క్లీన్ చేయాలని సూచించారు. వార్డులలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త నిల్వ కేంద్రం గదిని పరిశీలించారు. సమగ్ర సమాచారం లేకుండా వ్యవహరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ కొండల్ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనికి మెమో ఇవ్వమని సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్‌ను ఆదేశించారు. అనంతరం త్వరలో ఏర్పాటు కానున్న డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్, ఆర్ఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

సుజాతనగర్: రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చెప్పిన విధంగా తడిసిన ధాన్యంతో పాటు మొలకలొచ్చిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, తేమ 17 నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యం తెచ్చి వారం రోజులు కావస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం తగదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. గతేడాది మాదిరిగా నిబంధనలకు విరుద్ధంగా తరుగు తీస్తే ఊరుకోమన్నారు. ఎండల దృష్ట్యా కొనుగోలు కేంద్రం వద్ద టెంట్లు, మంచినీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉడుగుల శ్రీకాంత్, బాలు వెంకటేశ్వర్లు, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



మొక్కజొన్న కాంటా పెడుతున్న హమాలీలు

ఇల్లెందురూరల్: మండలంలో ఎట్టకేలకు శుక్రవారం మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 4వ తేదీన మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. కానీ వారం గడిచినా కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం, దీనికితోడు వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు అన్నదాతలకు కలవరపాటుకు గురిచేశాయి. కొనుగోలు కేంద్రాలలో రైతుల అవస్థలపై ‘కొనుగోళ్లకు ఎదురుచూపు’శీర్షికతో శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి పీఏసీఎస్ అధికారులు స్పందించారు.

వెంటనే చల్లసముద్రం, కొమరారం గ్రామాలలో కొనుగోళ్లను ప్రారంభించారు. ఆయా చోట్ల మొక్కజొన్న కాంటాను పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, సీఈఓ హరిప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత ఆలస్యమైనా కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. చల్లసముద్రం, కొమరారంతోపాటు ఇల్లెందు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోనూ మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

గనులు, డిపార్టుమెంట్లలో పరిశీలన



మాట్లాడుతున్న జీఎం రమేష్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, డిపార్టుమెంట్‌లను శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్, సీపీపీ సీహెచ్ నర్సింహారావు, జీఎం సీహెచ్‌పీ స్వామినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత వీకే ఓసీ విస్తరణ పనుల గురించి, జీకేఓసీఎంసీహెచ్‌పీ ప్రతిపాదన విస్తరణలో భాగంగా ఏరియా స్టోర్స్, మైన్స్ రెస్క్యూ స్టేషన్ తరలింపు విషయాలను గురించి చర్చించారు. అనంతరం వీకే ఓసీ ద్వారా ఉత్పత్తి చేస్తున్న బొగ్గు రవాణా కోసం నిర్మించే వీకే ఓసీల నిర్మాణంపై చర్చించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రఘురామిరెడ్డి, వీకే ఓసీ పీఓ రమేష్, పీఈ కరీముల్ల, సర్వేయర్ నాగరాజు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 15, 16, 17 తేదీలలో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 15 – 36 సంవత్సరాల యువతకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈ నెల 13, 14 తేదీలలో తమతమ ఎంపీడీఓ కార్యాల యాల్లో అందజేయాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



జూలూరుపాడు గ్రామ పంచాయతీ న్యూకాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. కాలనీలోని డ్రెయినేజీల్లో పూడిక పేరుకపోయింది. దీంతో మురుగు అస్తవ్యస్తంగా ప్రవహిస్తోంది. కాలనీలోని ఏ వీధిలో చూసినా రాళ్లు, కట్టెలు, వ్యర్థాలు, చెత్తా చెదారంతో సైడుకాలువలు నిండిపోయాయి. దుర్గంధం వెదజలుతున్నాయి. స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వేసవి కాలంలోనే ఇలా ఉంటే.. రానున్న వర్షాకాలంలో ఎలా ఉంటుందోనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : పి.కృష్ణ, ఎంపీఓ,
సెల్ నంబర్: 9908188125